సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

బుధవారం, 4, సెప్టెంబర్, 2024



ముగిసిన శ్రావణలక్ష్మి పూజలు

విశాఖ నగరంలోని కనక మహాలక్ష్మి దేవస్థానంలో శ్రావణమాసం విశిష్ట పూజలు మంగళవారంతో ముగిశాయి.



నేడు పలు రైళ్ల రద్దు

విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పునరుద్ధరణ చర్యల కారణంగా బుధవారం కొన్ని రైళ్లను రద్దుచేశారు. 12లో



ఘనంగా అప్పన్న తిరువీధి

సింహాచలం సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వారికి మంగళవారం తిరువీధి ఘనంగా జరిగింది.

న్యూస్‌రీల్

వైద్య శిబిరాలు నిర్వహించాలి

- కలెక్టర్‌కు అరకు ఎంపీ తనూజరాణి వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న అరకు ఎంపీ డాక్టర్ తనూజరాణి, చెట్టి వినయ్ దంపతులు

సాక్షి,పాడేరు: గిరిజన ప్రాంతాల్లో సీజనల్ వ్యాధుల తీవ్రత నెలకొన్న నేపథ్యంలో అన్ని గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజరాణి కోరారు. మంగళవారం ఆమె భర్త చెట్టి వినయ్‌తో కలిసి కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పలు సమస్యలపై ఆయనతో చర్చించారు. కలుషిత ఆహారం తిని గిరిజన విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న ఘటనలపై సమగ్ర విచారణ జరపాలని ఆమె కోరారు. వసతి గృహాలకు నాణ్యమైన పదార్థాలు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆమె విన్నవించారు. ఇటీవల భారీ వర్షాలకు దెబ్బతిన్న రోడ్లు, వంతెనలకు నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేపట్టాలన్నారు. ఈ మేరకు ఎంపీ వినతిపత్రం అందజేశారు.అడ్డుమండ సర్పంచ్ గుమ్మా శ్యాంసుందర్ పాల్గొన్నారు.

డెంగీ మరణంపై విచారణ



విచారణ జరుపుతున్న ఏడీఎంఅండ్‌హెచ్‌వో

రాజవొమ్మంగి: మండలంలోని లబ్బర్తి గ్రామంలో సంభవించిన డెంగీ మరణంపై రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం మంగళవారం లాగరాయి పీహెచ్‌సీలో విచారణ జరిపారు. సోమవారం లబ్బర్తి గ్రామంలో డెంగీ జ్వరంతో పి. రమణ అనే వ్యవసాయ కూలీ మృతి చెందడం తెలిసిందే. దీనిపై సాక్షిలో ప్రచురించిన కథనానికి స్పందించిన ఆయన వాగులు దాటి వచ్చారు. డెంగీ మృతుని కుటుంబ సభ్యులను పీహెచ్‌సీకు పిలిపించారు. మృతునికి ఆ సమయంలో అందిన వైద్యసేవల వివరాలను ఆయన తెలుసుకున్నారు. అదే విధంగా దీనిపై సమగ్ర విచారణ జరపాలని ఏడీఎంఅండ్‌హెచ్‌వో శిరీషను ఆదేశించారు. ఆమెను విచారణ అధికారిగా నియమించారు. పూర్తి నివేదికను తమ కార్యాలయానికి సమర్పించాలని ఆదేశించారు. విధినిర్వహణలో అలసత్వం వహిస్తే ఎంతటి వారైనా చర్యలు తప్పవని అధికారులను పీవో హెచ్చరించారు.


రహదారుల ఏర్పాటుకు చర్యలు

- రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం



రంపచోడవరం: ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో మంగళవారం ఇంజనీరింగ్ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఏజెన్సీ ఏడు మండలాల్లో మారుమూల గ్రామాలకు లింక్ రోడ్లు ఏర్పాటుకు వెంటనే ప్రతిపాదనలు తయారు చేసి అందజేయాలని సూచించారు. చేపట్టాల్సిన రోడ్లు, వంతెనల నిర్మాణాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఈఈ డేవిడ్‌రాజు, డీఈ చైతన్య, గౌతమి, శ్రీనివాసరావు, రాజేంద్రబాబు, నాగరాజు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టుల భర్తీకి 9న ఇంటర్వ్యూలు



ప్రిన్సిపాల్ విజయభారతి

చింతపల్లి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్, ఎకనామిక్స్ బోధించడానికి అతిథి అధ్యాపకుల నియామకానికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ విజయభారతి తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికిగాను ఆయా సబ్జెక్టుల్లో మాస్టర్ డిగ్రీ పొందిన అభ్యర్థులు ఈ నెల 9న డిగ్రీ కళాశాలలో జరిగే డెమో కార్యక్రమానికి హాజరుకావాలని ఆమె కోరారు. పీహెచ్‌డీ, యూజీసీసెట్, ఏపీసెట్ అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందన్నారు.అర్హులైన అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

కందిపప్పు లేనట్టేనా?

కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి జిల్లాలో రేషన్ కార్డుదారులకు కందిపప్పు సరఫరా నిలిచిపోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో క్రమం తప్పకుండా పంపిణీ జరిగేది. ఇప్పుడు నిలిచిపోవడానికి గల సరియైన కారణాలను అధికారులు చెప్పలేకపోతున్నారు. మూడు నెలలుగా ఇదే పరిస్థితి నెలకొన్నా రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన కరువైందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

- మూడు నెలలుగా రేషన్ కార్డుదారులకు అందని వైనం
- పూర్తిస్థాయిలో పంపిణీ ప్రకటనలకే పరిమితం
- మార్కెట్లో మండిపోతున్న ధర
- కిలో రూ.160
- పేదలపై ఆర్థికభారం



పంపిణీకి నోచుకోని కందిపప్పు



బియ్యం, పంచదార పంపిణీకి మాత్రమే పరిమితమైన పాడేరులోని ఎండీయూ వాహనం

సాక్షి,పాడేరు: పేదలకు అందజేయాల్సిన రేషన్ సరకుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోంది. జిల్లాలో మూడు నెలల నుంచి కందిపప్పు సరఫరా నిలిచిపోయినా స్పందన కరువైంది. రేషన్ కార్డుదారులకు బియ్యం, పంచదారతో సరిపెడుతోంది. కందిపప్పు కేటాయింపునకు సంబంధించి టెండర్ల ప్రక్రియ పూర్తికానందునే పంపిణీ జరగడం లేదని పౌరసరఫరాలశాఖ పరిధిలోని జీసీసీ గిడ్డంగుల అధికారులు చెబుతున్నారు. అయితే దీనిపై రేషన్‌కార్డుదారుల ప్రశ్నలకు జీసీసీ డిపోల అధికారులు, ఎండీయూ వాహనాల సిబ్బంది సమాధానం చెప్పలేకపోతున్నారు.

ప్రచారానికే పరిమితం

ప్రైవేట్ మార్కెట్లో కందిపప్పు ధర మండిపోతోంది. దీనివల్ల పేదలపై ఆర్థిక భారం పడుతోంది. దీంతో రేషన్ సరుకుల పంపిణీలో ప్రభుత్వం తీరుపై వారు ధ్వజమెత్తుతున్నారు. జిల్లాలోని 22 మండలాల పరిధిలో 671 డీఆర్ డిపోలు, 221 ఎండీయూ వాహనాలు, 2,98,092 రేషన్‌కార్డులు ఉన్నాయి. వీటిలో 83 శాతం కార్డులు గిరిజన కుటుంబాలకు చెందినవే. వీరికి కందిపప్పు ఎంతో అవసరం. పౌష్టికాహార వినియోగంపై రాష్ట్ర ప్రభుత్వం గిరిజన గ్రామాల్లో విస్తృత ప్రచారం చేస్తుంటుంది. ఇందులో కీలకమైన కందిపప్పు పంపిణీ విషయంలో మాత్రం రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందని గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రైవేట్ మార్కెట్లో అధిక ధర

కందిపప్పు ప్రైవేట్ మార్కెట్‌లో కిలో రూ.160 ఉంది. ఈ ధరకు కొనుగోలు చేసే పరిస్థితి లేదని రేషన్‌కార్డుదారులు వాపోతున్నారు. దీనివల్ల పౌష్టికాహారంలో కీలకమైన కందిపప్పునకు వారు దూరమవుతున్నారు. మూడు నెలల నుంచి అందకపోయినా కూటమి ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంపై గిరిజన కుటుంబాలు మండిపడుతున్నాయి.

గత ప్రభుత్వంలో క్రమం తప్పకుండా..

కూటమి అధికారం చేపట్టిన నాటి నుంచి ఈ దుస్థితి నెలకొందని రేషన్‌కార్డుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో బియ్యం, కందిపప్పు, పంచదార ప్రతి నెలా క్రమం తప్పకుండా సరఫరా జరిగేదని వారు తెలిపారు.

బయట కొనలేకపోతున్నాం



బియ్యం పొందినప్పుడల్లా కందిపప్పు కోసం అడుగుతున్నా. ప్రభుత్వం నుంచి కందిపప్పు సరఫరా లేదంటూ ఎండీయూ వాహనాల సిబ్బంది చెబుతున్నారు.బియ్యంతో పాటు కందిపప్పు అవసరమే. సంతల్లో అధిక ధరకు కందిపప్పును కొనుగోలు చేయలేకపోతున్నాం. ప్రతినెలా రేషన్ కార్డుపై కిలో కందిపప్పు ఇవ్వకపోవడం అన్యాయం.

– బి.నారాయణ, రేషన్‌కార్డుదారుడు, గుత్తులపుట్టు, పాడేరు మండలం

ప్రభుత్వానికి నివేదించాం

జిల్లాలో కందిపప్పు పంపిణీ లేకపోవడంపై రేషన్‌కార్డుదారులు అడుగుతున్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. ప్రస్తుతం బియ్యం, పంచదారను మాత్రమే రేషన్‌కార్డుదారులకు అందజేస్తున్నాం. ప్రభుత్వం నుంచి కందిపప్పు కేటాయింపు జరిగిన వెంటనే ఆయా కార్డుదారులకు వెంటనే పంపిణీకి తగు చర్యలు తీసుకుంటాం.

– గణేష్, జిల్లా పౌరసరఫరాల అధికారి, పాడేరు

రంపచోడవరం సబ్‌కలెక్టర్‌గా కల్పశ్రీ బాధ్యతల స్వీకరణ



సబ్ కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన కల్పశ్రీ



కల్పశ్రీని సత్కరిస్తున్న ఆలయ కమిటీ ప్రతినిధులు

రంపచోడవరం: రంపచోడవరం సబ్ కలెక్టర్‌గా కల్పశ్రీ మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం రెవెన్యూశాఖకు సంబంధించిన గిరిజనుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలు అర్హులకు అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆమెను రెవెన్యూ సిబ్బంది ,తహసీల్దార్లు సీహెచ్ శ్రీనివాసరావు, సత్యనారాయణ, కె సుబ్బారావు , బి.రాజు,రామకృష్ణ, డీటీలు బాలాజీ, శ్రీధర్, శివ మర్యాద పూర్వకంగా కలిశారు. అభినందనలు తెలిపారు.

మోదమ్మకు కల్పశ్రీ పూజలు

సాక్షి, పాడేరు: స్థానిక మోదకొండమ్మతల్లిని రంపచోడవరం సబ్‌కలెక్టర్ కె.ఆర్.కల్పశ్రీ మంగళవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆమెను ఆలయ కమిటీ ప్రతినిధులు సత్కరించారు. అమ్మవారి ఫొటో, ప్రసాదం అందజేశారు.

వరదలను సమర్థంగా ఎదుర్కొందాం

- టెలీకాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దినేష్‌కుమార్

12లో

విద్యార్థినులకు ఇలాంటి భోజనమా పెట్టేది?

- పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు లిల్లీ ధ్వజం
- బంధవీధి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల సందర్శన
- రుచి, నాణ్యత లేకపోవడంపై ఆగ్రహం
- అధికారులకు ఇచ్చే కాసుల కోసం కోత విధిస్తారా..అంటూ విమర్శ



విద్యార్థినులతో కలసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఎస్టీ కమిషన్ సభ్యురాలు లిల్లీ

జి.మాడుగుల: ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యతతో భోజనం అందించాలని, లేకుంటే చర్యలు తప్పవని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు జంపరంగి లిల్లీ హెచ్చరించారు. మండలంలో బంధవీధి ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలను మంగళవారం వారు సందర్శించారు. విద్యార్థినుల కోసం సిద్ధం చేసిన ఆహార పదార్థాలను వారు పరిశీలించారు. కూర, సాంబారు, అన్నం నాణ్యత, రుచిగా లేకపోవడంపై నిర్వాహకులపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆశ్రమ పాఠశాలలో ఇలాంటి ఆహారం అందిస్తే విద్యార్థినులు ఎలా తింటారని, అధికారులకు ఇచ్చే కాసుల కోసం విద్యార్థుల ఆహారంలో కోత విధిస్తారా? అంటూ వారు ధ్వజమెత్తారు. రెండు రోజుల నుంచి గుడ్డు ఇవ్వడం లేదని ఆదివారం చికెన్, బిర్యానీ పెట్టలేదని విద్యార్థినులు వారి దృష్టికి తీసుకువచ్చారు. చికెన్, బిర్యానీ ఎందుకు అందించలేదు అని వారు తిరిగి విద్యార్థినులను ప్రశ్నించారు. వర్షాకాలం కారణంగా చికెన్, గుడ్లు తినకూడదని ఏటీడబ్ల్యూవో ఆదేశమని వసతి గృహ వార్డెన్ చెప్పారని బదులిచ్చారు. వసతి గృహాల్లో గిరిజన సంక్షేమ శాఖ డీడీ, ఏటీడబ్ల్యూవోల పర్యవేక్షణ లోపం స్పష్టంగా కన్పిస్తుందన్నారు. వీరిపై కూడా జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలలో నాణ్యతలేని భోజనం అందించడంపై కలెక్టర్, ఐటీడీఏ పీవో దృష్టి సారించి తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

అధికారుల నిర్లక్ష్యం వల్లే 'జామిగుడ' ఘటన

- అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం
- విద్యార్థినులకు మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర పరామర్శ



భోజనం రుచి చూస్తున్న భాగ్యలక్ష్మి, చిత్రంలో ఎమ్మెల్యే మత్స్యలింగం, జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర



పిల్లల ఆరోగ్య పరిస్థితిని సూపరింటెండెంట్ నుంచి తెలుసుకుంటున్న సుభద్ర, మత్స్యలింగం, భాగ్యలక్ష్మి

డుంబ్రిగుడ: జామిగుడ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినుల అస్వస్థతకు అధికారుల నిర్లక్ష్యమే కారణమని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం విమర్శించారు. మంగళవారం ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి జామిగుడ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. సిద్ధం చేసిన ఆహార పదార్థాలను భాగ్యలక్ష్మి రుచి చూశారు. నాణ్యత పెంచాలని నూతన డిప్యూటీ వార్డెన్‌కు సూచించారు. స్టాక్ గదిని పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. తీవ్ర అస్వస్థతకు గురైన విద్యార్థినులకు తక్షణ వైద్యం అందించాలని కలెక్టర్, పాడేరు ఐటీడీఏ పీవో, విద్య, వైద్యశాఖ అధికారులను కోరామన్నారు. ఈఘటనకు కారణమైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరినట్టు చెప్పారు. మళ్లీ ఇలాంటి సమస్య పునరావృతం కాకూడన్న ఉద్దేశంతోనే పాఠశాలను సందర్శించి పరిస్థితులను పరిశీలిస్తున్నామని చెప్పారు. ఇంత జరుగుతున్నా ప్రభుత్వం, అధికారుల తీరు మార్చుకోలేదంటూ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఎంపీపీ బాక.ఈశ్వరి, జెడ్పీటీసీ చట్టారి జానకమ్మ, ఎంపీటీసీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యం అందించాలి

అరకులోయ టౌన్: కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురై స్థానిక ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న జామిగుడ ఆశ్రమ విద్యార్థినులను మంగళవారం ఉమ్మడి విశాఖ జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని సూపరింటెండెంట్ రాము నుంచి తెలుసుకున్నారు. ఇన్ పేషెంట్లకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఓపీకి వచ్చిన వారితో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ వసతి గృహాల్లో విద్యార్థులకు వేడిగా భోజనాలు పెట్టాలని, మిగిలిపోయిన అన్నం కూరలు, కుళ్లిన కోడి గుడ్లు పెట్టి మన పిల్లలకు మనమే అనారోగ్యానికి గురిచేస్తున్నామన్నారు. హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్, హెడ్ కుక్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఉడకబెట్టిన గుడ్డు ఉదయం టిఫిన్‌తో లేదా మధ్యాహ్న భోజనంతో పెట్టాల్సి ఉండగా రాత్రి పూట కోడి గుడ్డు కూర ఎలా పెడతారని ప్రశ్నించారు. ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ జామిగుడ పాఠశాల విద్యార్థినులు కలుషిత ఆహారం తిని అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరిన సమయంలో తాను తిరుపతి పర్యటనలో ఉన్నానన్నారు. అయినప్పటికీ కలెక్టర్, ఐటీడీఏ పీవో, డీఎంఅండ్‌హెచ్‌ఓలతో మాట్లాడి బాధిత చిన్నారులకు మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. కలుషిత ఆహార ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వసతి గృహాల్లో వంట గది, ఇతర పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఎంపీటీసీ దురియా ఆనంద్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకుడు కమిడి అశోక్, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు పాల్గొన్నారు.

డెంగ్యూ మరణాలపై కలెక్టర్ ఆగ్రహం

- ఐటీడీఏ పీవోలతో విచారణకు ఆదేశం
- తప్పుడు డేటా ఇచ్చిన సీడీపీవోలకు షోకాజ్





హాజరైన అధికారులు, (ఇన్‌సెట్) మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు: పాడేరు, రాజవొమ్మంగి ప్రాంతాల్లో రెండు డెంగ్యూ మరణాలు చోటుచేసుకోవడంపై కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి ఐటీడీఏ పీవోలు, పలు శాఖల జిల్లా అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు, సీడీపీవోలతో నిర్వహించిన వీడియో సమావేశంలో మాట్లాడారు. పాడేరు జిల్లా ఆస్పత్రి పరిధిలో జరిగిన డెంగ్యూ మరణంపై ఐటీడీఏ పీవో అభిషేక్, రాజవొమ్మంగి సీహెచ్‌సీ పరిధిలో సంభవించిన మృతిపై రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహచలం సమగ్ర విచారణ జరిపి వెంటనే నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటామని ఆయన స్పష్టం చేశారు.

చిన్నారుల సమాచారంలో తప్పులు

తప్పుడు నివేదికలు ఇచ్చారంటూ జిల్లాలోని ఏడుగురు ఐసీడీఎస్ సీడీపీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మిని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఐసీడీఎస్ కార్యక్రమాలపై సమీక్ష జరిపిన ఆయన పిల్లల వయసు, ఎత్తు,బరువుకు సంబంధించి ఇచ్చిన డేటాలో తప్పులు ఉండటాన్ని ఆయన గమనించారు. దీనిపై, హుకుంపేట సీడీపీవో ఇచ్చిన సమాధానంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పుడు నివేదికలు ఇచ్చిన అనంతగిరి, హుకుంపేట, పెదబయలు, జి.కే.వీధి, జి.మాడుగుల, అరకులోయ, డుంబ్రిగుడ మండలాల సీడీపీవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. పౌష్టికాహార పునరావాస కేంద్రాల్లో అత్యధిక మొత్తాలకు బిల్లులు పెడుతున్నందున ఇకపై బిల్లులపై ఐసీడీఎస్ పీడీ సంతకం కూడా ఉండాలని ఆయన సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాలను రెండు రోజులకు ఓసారి సందర్శించాలని, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల సంక్షేమం, పౌష్టికాహార పంపిణీ, బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. సంబంధిత వివరాలను సూపర్‌వైజర్, ఏఎన్‌ఎం, వైద్యాధికారులకు తెలియజేయాలన్నారు. ఇటీవల అన్ని మండలాలకు నియమితులైన ప్రత్యేకాధికారులు మండల స్థాయి సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. ఉపాధి హామీ పథకం ప్లాంటేషన్ పనులు వేగవంతం చేయాలని, డీఆర్‌డీఏ అధికారులు బ్యాంకర్లతో మాట్లాడి బ్యాంకు లింకేజీలు కల్పించాలని, రుణ రికవరీ చేపట్టాలని సూచించారు. ఈనెలాఖరుకు పూర్తిస్థాయిలో చెత్తాచెదారాలను తొలగించాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ అభిషేక్‌గౌడ్, రంపచోడవరం ఐటీడీఏ పీవో సింహాచలం, డ్వామా పీడీ శివయ్య, డీఆర్‌డీఏ పీడీ మురళీ, డీఎంహెచ్‌వో డాక్టర్ జమాల్‌బాషా, డీపీవో కొండలరావు, ఐసీడీఎస్ పీడీ సూర్యలక్ష్మి, డీఎల్పీవో కుమార్, హౌసింగ్ ఈఈ బాబు పాల్గొన్నారు.

సమర్థవంతంగా మధ్యాహ్న భోజన పథకం

ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని సమర్థవంతంగా అమలుజేసి, విద్యార్థులకు బలవర్ధకమైన ఆహారాన్ని అందించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం పాడేరు డివిజన్ పరిధిలోని ఎంఈవోలు, హెచ్‌ఎంలు, పాఠశాల విద్యాకమిటీ ప్రతినిధులతో భౌతికంగా, చింతూరు, రంపచోడవరం పరిధిలోని అధికారులతో వర్చువల్ విధానంలో మెనూ రూపకల్పన, మధ్యాహ్న భోజన పథకం అమలుపై ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన మెనూను కచ్చితంగా అమలుజేయాలని ఆదేశించారు. ఆయా ప్రాంతాలలో లభ్యమవుతున్న కూరగాయలు, ఆకుకూరలతో వంటలు తయారు చేయాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో 98శాతం పేద విద్యార్థులు చదువుతున్నారని, వారందరికి నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీ చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. భోజనంలో 900 క్యాలరీలు, 23గ్రాముల ప్రోటీన్లు ఉండేలాగా ఆరు రోజులకు అవసరమైన మెనూ చార్టును సిద్ధం చేయాలన్నారు. వారంలో మూడు రోజులు చిక్కీలు, మరో 3 రోజులు రాగిజావను విద్యార్థులకు పంపిణీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు కట్టా సింహాచలం, అపూర్వ భరత్, డీఈవో పి.బ్రహ్మాజీరావు పాల్గొన్నారు.

పలువురు ఎస్‌ఐలకు బదిలీలు

విశాఖ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు

పాడేరు : జిల్లాలోని పలువురి ఎస్‌ఐలను బదిలీ చేస్తూ విశాఖ రేంజ్ డీఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. పాడేరు ఎస్‌ఐగా ఎ.సత్యనారాయణను నియమించారు. ఈయన అనకాపల్లి జిల్లా చోడవరం పోలీస్ స్టేషన్ నుంచి వచ్చారు. జి.మాడుగుల ఎస్‌ఐ ఎ. శ్రీనివాసరావును విశాఖపట్నం రేంజ్‌లో వీఆర్‌లో ఉంచారు. ఆయన స్థానంలో మన్యం పార్వతీపురం జిల్లా కురుపాం ఎస్. షణ్ముఖరావును నియమించారు. డుంబ్రిగుడ ఎస్‌ఐ కె. సంతోష్‌కుమార్‌ను విశాఖపట్నం రేంజ్ వీఆర్‌లో ఉంచారు. ఆయన స్థానంలో అనకాపల్లి జిల్లా యలమంచిలి టౌన్ ఎస్‌ఐ కె.పాపినాయుడును నియమించారు. పెదబయలు ఎస్‌ఐ పి.మనోజ్‌కుమార్‌ను విశాఖ రేంజ్ వీఆర్‌లో ఉంచారు. ఆయన స్థానంలో అనకాపల్లి జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న కొల్లి రమణను నియమించారు. మంప ఎస్‌ఐ జే.లోకేష్‌ను విశాఖపట్నం రేంజ్ వీఆర్‌లో ఉంచారు. ఆయన స్థానంలో అనకాపల్లి జిల్లా రోలుగుంట ఎస్‌ఐ ఎల్. సురేష్‌ను నియమించారు. ముంచంగిపుట్టు ఎస్‌ఐ కె. రవీంద్రను సీలేరు ఎస్‌ఐగా నియమించారు. ఆయన స్థానంలో అనకాపల్లి రూరల్ ఎస్‌ఐ జి. తేజేశ్వరరావును నియమించారు. సీలేరు ఎస్‌ఐ జె.రామకృష్ణను జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో డీసీఆర్‌బీకు బదిలీ చేశారు. విజయనగరం జిల్లా జామి ఎస్‌ఐ గాదే వీరబాబును జిల్లా పోలీస్ శాఖ కార్యాలయంలో డీఎస్‌బీలో నియమించారు.

16 బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు

ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందర్‌రావు



కోతకు గురైన కాజ్‌వేకు మరమ్మతులు

పెదబయలు: జిల్లాలోని 22 మండలాల్లో 16 కాజ్‌వేల స్థానంలో బ్రిడ్జిల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్టు ఆర్‌అండ్‌బీ ఈఈ బాలసుందర్‌రావు తెలిపారు. మంగళవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ జిల్లాలో కాజ్‌వేలు తక్కువ ఎత్తులో ఉన్నందున చిన్నపాటి వర్షానికి వరద ముంపునకు గురవుతున్నాయన్నారు. కొన్ని సందర్భాల్లో నష్టం జరగడం వల్ల రాకపోకలు బంద్ అవుతున్నాయన్నారు. ఈ సమస్యను అధిగమించేందుకు గాను ఐటీడీఏ పీవో, కలెక్టర్ ఆదేశాల మేరకు వాటి స్థానంలో బ్రిడ్జిలు (హైలెవెల్) నిర్మాణానికిగాను ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపిస్తామని చెప్పారు. మండలంలో మర్రిపుట్టు గ్రామ సమీపంలో వరద ప్రవాహానికి దెబ్బతిన్న కాజ్‌వేకు మరమ్మతులు చేపట్టామని తెలిపారు. కోతకు గురైన ప్రదేశంలో పెద్ద బండరాళ్లను జేసీబీ సాయంతో అమర్చినట్టు చెప్పారు. మరమ్మతులు పూర్తయినందున భారీ వాహనాల రాకపోకలు సాగించవచ్చని ఈఈ పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి ఆమోదం వచ్చిన వెంటనే మండలంలోని పరదానిపుట్టు మత్స్యగెడ్డ, గేదె గెడ్డ, కుమ్మరివీధి కాజ్‌వేల స్థానంలో బ్రిడ్జిల నిర్మాణం చేపడతామన్నారు. ఆయన వెంట డీఈఈ శ్యాంసన్ విజయ్‌కుమార్, ఏఈ వెంకటరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యార్థినుల అదృశ్యం కేసులో ముగ్గురి అరెస్టు

• నిందితులపై పోక్సో కేసు

పాడేరు : జి.మాడుగుల మండలం బందవీధి గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఇద్దరు టెన్త్ విద్యార్థినుల అదృశ్యం ఘటనలో ప్రమేయమున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. గత నెల 27న ఇద్దరు టెన్త్ విద్యార్థులు పాఠశాల నుంచి అదృశ్యమై ఈనెల 1న పాడేరులో ప్రత్యక్షమైన ఘటన స్థానికంగా కలకలం రేపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై ఇప్పటికే పాఠశాల హెచ్ఎం, డిప్యూటీ వార్డెన్, కమాటీలను ఐటీడీఏ పీవో అభిషేక్ సస్పెండ్ చేశారు. ఈ ఘటనపై తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఘటనలో ప్రమేయమున్న డుంబ్రిగూడ మండల పరిషత్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఎస్.శేషు, భారత్ గ్యాస్ ఏజెన్సీలో పనిచేస్తున్న చినబాబు, గోపిచంద్‌లపై పోక్సో కేసులు నమోదు చేసి అరెస్టు చేసినట్టు సీఐ డి.నవీన్‌కుమార్ విలేకరులకు తెలిపారు.

గిరి విద్యార్థినికి ఎయిమ్స్‌లో సీటు


శ్రీవల్లి

అనంతగిరి(అరకులోయ రూరల్): మండలంలోని బొడ్డచెట్టు కాలనీకి చెందిన గిరిజన దంపతులు బోయిన భీమన్న, సుమిత్రల కుమార్తె శ్రీవల్లి హైదరాబాద్(బీబీనగర్) ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించింది. శ్రీవల్లి 10వ తరగతిలో 592, ఇంటర్మీడియెట్‌లో 986 మార్కులు పొందింది. ఇటీవల నిర్వహించిన నీట్‌లో 720 మార్కులకు గాను 638 మార్కులు సాధించినట్టు ఆమె తల్లిదండ్రులు తెలిపారు. ఎయిమ్స్‌లో సీటు సాధించిన శ్రీవల్లిని స్థానికులు, బంధువులు అభినందించారు.

46 మందికి వైద్యసేవలు


వైద్యశిబిరంలో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని శరభవరం పంచాయతీలోని శరభవరం కాలనీలో మంగళవారం నిర్వహించిన ఫ్యామిలీడాక్టర్ వైద్య శిబిరంలో 46 మందికి వైద్యసేవలు అందజేశారు. గర్భిణులు, బాలింతలకు రక్త పరీక్షలు చేశారు. రక్త హీనతతో బాధపడుతున్న వారికి, మధుమేహం, బీపీ పేషెంట్లకు మందులు పంపిణీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల తగిన జాగ్రత్తలు పాటించాలని, దోమ కాటు నుంచి రక్షించుకునేందుకు దోమతెరలు ఉపయోగించాలని సూచించారు. ఎంఎల్‌హెచ్‌పీ దేవి, ఏఎన్ఎం మహేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ నానిబాబు, 104 డీఈవో శ్రీనివాస్, పైలెట్ కనకరాజు పాల్గొన్నారు.

వరదలను సమర్థంగా ఎదుర్కొందాం

కలెక్టర్ దినేష్‌కుమార్


టెలీకాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్


శ్రీరామగిరిలో ప్రజలతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి కల్పశ్రీ

సాక్షి,పాడేరు: రానున్న వరదలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, ప్రజలు ఆందోళన చెందవద్దని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం రాత్రి ఆయన కలెక్టరేట్ నుంచి ఎస్పీ అమిత్ బర్దర్, చింతూరు ఐటీడీఏ పీవోఅపూర్వ భరత్, చింతూరు డివిజన్‌లోని అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి నీటిమట్టం 38 అడుగులకు చేరితే రెండు రహదారులు బ్లాక్ అయ్యే పరిస్థితి ఉందన్నారు. 41 అడుగులకు చేరితే వీఆర్ పురం మండలంలోని శ్రీరామగిరితో పాటు మరో నాలుగు గ్రామాలు ముంపునకు గురయ్యే పరిస్థితి ఉందన్నారు. భద్రాచలంలో గోదావరి 43 అడుగులకు చేరితే మొదటి హెచ్చరిక జారీ చేస్తారన్నారు. ముందస్తు జాగ్రత్తలు చేపట్టామని ప్రజలు ఆందోళన చెందకుండా అధికారులు భరోసా కల్పించాలని కలెక్టర్ సూచించారు. ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో పాటు బోట్లు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఉచిత రేషన్ పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు.కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి విధులు సక్రమంగా నిర్వహించాలని, గర్భిణులను ముందస్తుగానే సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, అవసరమైన మందులు సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు. పునరావాస కేంద్రాలను గుర్తించాలని, అవసరమైతే వరద బాధితులను అక్కడకు తరలించాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితులలోను ప్రాణ, ఆస్తి నష్టాలు లేకుండా చూడాలని సూచించారు. ,ప్రజలకు సమాచారం ఇవ్వడంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు బాధ్యత వహించాలన్నారు. అలాగే వరదల సమయంలో తీసుకునే చర్యలు, రోజువారీ సమాచారాన్ని నివేదిక రూపంలో ప్రతిరోజు మీడియాకు అందజేయాలని ఎస్‌డీసీ అంబేద్కర్‌ను కలెక్టర్ ఆదేశించారు.

చింతూరు: భద్రాచలంలో వరద పెరుగుతున్న దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని రంపచోడవరం సబ్ కలెక్టర్, వీఆర్‌పురం మండల ప్రత్యేకాధికారి కల్పశ్రీ సూచించారు. మంగళవారం రాత్రి వీఆర్‌పురం మండలం శ్రీరామగిరిలో ఆమె ప్రజలతో మాట్లాడారు. ఎగువ ప్రాంతాల్లో వరద క్రమేపీ పెరుగుతోందని, వరదనీరు గ్రామాల్లోకి ప్రవేశిస్తే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మండల, దిగువ స్థాయి సిబ్బంది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ వరద పరిస్థితిని అంచనా వేయాలని ఆమె ఆదేశించారు. వరద తీవ్రత పెరిగితే ప్రజలను ఇళ్లను ఖాళీ చేయించి పునరావాస కేంద్రాలకు తరలించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుబ్బారావు, ఎంపీడీవో ఫణీంద్ర పాల్గొన్నారు.

డీసీసీబీ డిజిటలైజేషన్..!

- సొసైటీల రికార్డుల కంప్యూటరీకరణ
- డీసీసీబీ చరిత్రలో ఇదే తొలిసారి
- నాబార్డ్ ఆదేశాలతో స్పెషల్ డ్రైవ్
- సభ్యుల సమస్త వివరాల సేకరణ


మర్రిపాలెంలోని డీసీసీబీ ప్రధాన కార్యాలయం

విశాఖ విద్య: వ్యవసాయ పరపతి సంఘాలను ప్రక్షాళన చేసే దిశగా అడుగులు ముందుకు పడుతున్నాయి. నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) ఆదేశాలతో డీసీసీబీ అధికార యంత్రాంగమంతా ప్రస్తుతం ఇదే పనిలో నిమగ్నమైంది. ఈ సంఘాల్లో సభ్యత్వం పొందిన రైతులు, వివిధ రకాల రుణాలు పొందిన వారి సమస్త వివరాలను ప్రత్యేక వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. అక్టోబర్ 2న గాంధీ జయంతి నాటి నుంచి సొసైటీల్లోని అన్ని రకాల కార్యకలాపాలు ఆన్‌లైన్ ద్వారానే జరగాలనే ఉన్నతాధికారుల ఆదేశాలతో డీసీసీబీ సీఈవో డి.వి.ఎస్.వర్మ ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉమ్మడి విశాఖ జిల్లా పరిధిలోని తమ యంత్రాంగానికి దిశానిర్దేశం చేస్తున్నారు. డేటా సేకరణపై ప్రతి రోజు సంఘాల వారీగా సమీక్షలు నిర్వహిస్తున్నారు.

బినామీలకు చెక్ పెట్టేలా..

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు(డీసీసీబీ) పరిధిలో 98 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు(పీఏసీఎస్) ఉన్నాయి. వీటిలో 3,88,179 మంది సభ్యులున్నారు. సొసైటీల్లో సభ్యత్వం పొందిన వారికి తక్కువ వడ్డీకి రుణాలు అందిస్తున్నారు. చాలా చోట్ల రైతుల పేరుతో బినామీలు చొరబడి ప్రభుత్వ సబ్సిడీ రుణాలను కొల్లగొడుతున్నారని ఫిర్యాదులున్నాయి. ఇలాంటి వాటిపై నాబార్డు దృష్టి పెట్టింది. వీటికి అడ్డుకట్ట వేసేలా సహకార సంఘాల్లోనూ ఆన్‌లైన్ ద్వారానే కార్యకలాపాలు నిర్వహించాలనే నాబార్డు ఆదేశాలకు అనుగుణంగా డీసీసీబీ అధికారులు చర్యలు చేపట్టారు.

'డీసీటీ'లో సభ్యుల సమగ్ర వివరాలు

సొసైటీల వారీగా సభ్యులకు చెందిన భూములు, ఆస్తులు, వారు తీసుకున్న రుణం, కుటుంబ పరిస్థితి వంటి సమగ్ర వివరాలను నాబార్డ్ ప్రత్యేకంగా రూపొందించిన డేటా క్యాప్చర్ టూల్(డీసీటీ) అనే వెబ్‌సైట్‌లో పొందుపరుస్తున్నారు. ఆధార్ నంబర్‌తో ఆ వివరాలను అనుసంధానిస్తుండటంతో దేశంలో ఎక్కడైనా బ్యాంకుల్లో వీరి వివరాలు పరిశీలించే అవకాశం ఉంటుంది. రుణ గ్రహీతల వివరాలను సకాలంలో గుర్తించేందుకు వీలుగా ఈ ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం సొసైటీల్లో సిబ్బంది అంతా ఇదే పనిలో నిమగ్నమవడంతో ఖరీఫ్ రుణాల మంజూరులో తీవ్ర జాప్యం ఏర్పడుతోంది.

అందుబాటులో లేని రికార్డులతో తర్జన భర్జన

సొసైటీలో సభ్యుల డేటా సేకరణ సవ్యంగా ముందుకు సాగడం లేదు. విశాఖ జిల్లాలోని 13 సొసైటీల్లో 60,668 మంది సభ్యులుండగా.. వీరిలో ఇప్పటివరకు 11,843 మంది సభ్యుల వివరాలు సేకరించారు. 8,889 మంది వివరాలను డీసీటీ పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. అల్లూరి జిల్లాలోని 11 సొసైటీల్లో 27,831 మంది సభ్యులకు గాను 7,812 మంది సభ్యుల వివరాలు సేకరించారు. 2,500 మంది వివరాలను అప్‌లోడ్ చేశారు. అనకాపల్లి జిల్లాలోని 74 సొసైటీల్లో 2,99,660 మంది సభ్యులుండగా.. వీరిలో ఇప్పటివరకు 1,08,255 మంది వివరాలను సేకరించి.. 86,775 మంది డేటాను అప్‌లోడ్ చేశారు. సభ్యుల వివరాల కంప్యూటరీకరణ డీసీసీబీ చరిత్రలో ఇదే తొలిసారి కావడంతో చాలా మంది వివరాలు సొసైటీల్లో అందుబాటులో లేని పరిస్థితి ఉంది.

భవిష్యత్తు అవసరాలకు ఎంతో మేలు



సహకార సంఘాల కంప్యూటరీకరణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. దీని వల్ల పారదర్శకతతో పాటు భవిష్యత్తులో రుణాలు సకాలంలో పొందేందుకు ఉపయోగకరంగా ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా, ఉన్నతాధికారుల సూచనలతో గడువులోగా సభ్యుల సమస్త సమాచారాన్ని ఆన్‌లైన్‌లో పొందుపరిచేలా ప్రతి రోజూ సొసైటీల వారీగా సమీక్షిస్తున్నాం. ఆన్‌లైన్ పనులతో ఖరీఫ్ రుణాల మంజూరుకు ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం.

– డి.వి.ఎస్.వర్మ, డీసీసీబీ సీఈవో

సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి

ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు


రైతులకు రాజ్‌మా విత్తనాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు

పాడేరు : వ్యవసాయ శాఖ ద్వారా గిరిజన రైతులకు సబ్సిడీపై అందజేస్తున్న రాజ్‌మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. సుండ్రుపుట్టు రైతు భరోసా కేంద్రంలో మంగళవారం గిరిజన రైతులకు రాజ్‌మా విత్తనాలను, సేంద్రియ ఎరువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులకు అధికారులు అందజేస్తున్న 350 క్వింటళ్ల రాజ్‌మా విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి నందు, మండల పరిషత్ అధ్యక్షురాలు సొనారి రత్నకుమారి, సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, వైస్ ఎంపీపీ కుంతూరు కనకాలమ్మ, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు సల్లా చిట్టమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సీదరి రాంబాబు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు, ఎంపీటీసీ కుంతూరు నర్సింహమూర్తి, సర్పంచ్‌లు వంతాల రాంబాబు, వనుగు బసవన్నదొర, గొల్లోరి నీలకంఠం, వంతాల బొంజుబాబు పాల్గొన్నారు.

శానిటేషన్ నిధులు ఏమయ్యాయి?


మాట్లాడుతున్న ఎంపీపీ కారం లక్ష్మి

చింతూరు: గత నెలలో వరదల సందర్భంగా గ్రామ పంచాయతీలకు వచ్చిన శానిటేషన్ నిధులు ఏమయ్యాయో అధికారులు తేల్చాలని వీఆర్‌పురం ఎంపీపీ కారం లక్ష్మి డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సర్పంచ్‌లతో కలసి ఆమె మాట్లాడుతూ వరదల సందర్భంగా శానిటేషన్ నిమిత్తం ప్రభుత్వం నిధులు మంజూరు చేసి గ్రామ పంచాయతీ కార్యదర్శులకు నగదు రూపంలో అందజేసిందని ఆమె తెలిపారు. కార్యదర్శులకు అందిన సొమ్మును ఎక్కడ ఖర్చు చేశారనే విషయం తేలడంలేదని, వరదల నిమిత్తం శానిటేషన్ కోసం నిధులు మంజూరైన విషయం కూడా సర్వసభ్య సమావేశంలో చెప్పారని ఆమె తెలిపారు. సర్పంచ్‌లకు కూడా తెలియకుండా శానిటేషన్ నిధులు స్వాహా చేశారని, నిధుల మంజూరు విషయం ఎంపీడీవోకు సైతం తెలియకుండా గోప్యంగా ఉంచడంలో అంతరార్థం ఏమిటని ఆమె ప్రశ్నించారు. ఈ విషయంపై అధికారులు సమగ్రంగా దర్యాప్తు నిర్వహించి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో ఎంపీటీసీ సభ్యుడు పూనెం ప్రదీప్, సర్పంచ్‌లు కారం బుచ్చమ్మ, శెట్టి లక్ష్మి, సవలం మారయ్య, పూనెం సరోజిని, పులి సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

కవల పిల్లలకు ఉచితంగా పాల డబ్బాలు


పాలడబ్బాలు అందజేస్తున్న యూనిటీ ఫర్ ఛారిటీ ట్రస్ట్ సభ్యులు

డుంబ్రిగుడ: తల్లికి, తల్లిపాలకు దూరమైన కవల పిల్లలకు రెండేళ్ల పాటు ఉచితంగా పాల డబ్బాలు అందజేయనున్నట్టు యూనిటీ ఫర్ ఛారిటీ ట్రస్టు సభ్యులు నీలిజోష్ఫిన్ తెలిపారు. కండ్రుమ్ పంచాయతీ గొంగుడ గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ వంతల సోయిత(35) నెల రోజుల క్రితం కవల పిల్లలకు జన్మనిచ్చి మరణించింది. ఈ పిల్లల కోసం నెలనెలా పాల డబ్బాలు కొనుగోలు చేసేందుకు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ఆ కుటుంబానికి ఉచితంగా పాల డబ్బాలు అందజేయడానికి ట్రస్ట్ ముందుకు వచ్చింది. ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ఆధ్వర్యంలో గ్రామంలో మంగళవారం జరిగిన కార్యక్రమంలో పాలడబ్బాలను అందజేశారు. ఈకార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం డుంబ్రిగుడ మండల కార్యదర్శి టి.సూర్యనారాయణ, మండల నాయకులు కె.రాంచందర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం సాగులో ఉంటేనే భూమిపై హక్కు


గ్రామసభలో మాట్లాడుతూన్న డీఎఫ్‌వో

చింతపల్లి: నిబంధనల ప్రకారం అటవీ భూమిని సాగు చేసుకున్న గిరిజనులే ఆ భూమిపై హక్కు పొందవచ్చని డీఎఫ్‌వో సూరి నారాయణ పడాల్ అన్నారు. హైకోర్టు ఆదేశాల మేరకు మండలంలోని చౌడుపల్లి పంచాయతీ పరిధిలో చవటపాడు, పెళ్ళిమామిడి గ్రామాల మధ్య నెలకొన్న భూవివాదంపై తసిల్దార్ రామకృష్ణతో కలిసి మంగళవారం గ్రామసభ నిర్వహించారు. ఈసందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ భూమిపై సాగు హక్కు పత్రాలు జారీకి ఎఫ్ఆర్‌సీఎఫ్‌డీఎల్‌సీ, డీఎల్సీ స్థాయిలో విచారణ చేయవలసి ఉంటుందన్నారు. 1967 కంటే ముందు సాగులో ఉన్నట్లయితే ఆ గిరిజనులకు ఆర్‌వోఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పెళ్లిమామిడి గిరిజనులు హక్కు పత్రాలు మంజూరు చేయాలని హైకోర్టును ఆశ్రయించారు. అయితే 110 హెక్టార్ల భూమిని 2008లో చవటపాడు గ్రామానికి వన సంరక్షిత సమితి పేరున కేటాయించినట్టు తెలిపారు. ఈకార్యక్రమంలో రేంజర్ రాజుబాబు, సర్పంచ్ లలిత, గ్రామ పెద్దలు వెంగళయ్య, కరుణానిధి, సాగిన కృష్ణపడాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు తొత్తుగా కేంద్ర ప్రభుత్వం

- ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రమేంద్రకుమార్ హెచ్చరిక


సంఘీభావం తెలుపుతున్న ఏఐటీయూసీ నేతలు

సీతమ్మధార(విశాఖ): పరిశ్రమల యాజమాన్యాలకు కేంద్రం తొత్తుగా వ్యవహరిస్తోందని ఏఐటీయూసీ జాతీయ అధ్యక్షుడు రమేంద్రకుమార్ ఆరోపించారు. ఆశీలమెట్ట జీవీఎంసీ గాంధీపార్కులో మంగళవారం జరిగిన ఏఐటీయూసీ జాతీయ మహాసభల ముగింపు సభలో ఆయన మాట్లాడారు. ఫార్మాసిటీలో భద్రత కరువై ఎందరో కార్మికుల ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదని విచారం వ్యక్తం చేశారు. కార్మికుల హక్కులు హరించి ప్రాణాలకు రక్షణ లేకుండా చేస్తున్నారన్నారు. బీజేపీ కూటమి ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు కారుచౌకగా కట్టబెడుతోందని దుయ్యబట్టారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ జోలికొస్తే ఊరుకునేది లేదని ఆయన హెచ్చరించారు. జాతీయ కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను పరిరక్షించాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం 1,200 రోజులకుపైగా పోరాటం చేస్తున్నా.. కేంద్రం స్పందించడం లేదన్నారు. స్టీల్‌ప్లాంట్ కోసం వచ్చిన బిడ్డర్లను కార్మికులు ఎయిర్‌పోర్టు నుంచి బయటకు రానివ్వలేదని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో ఎటువంటి చర్చా లేకుండా ఆమోదించిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.ఈ మేరకు ఈనెల 23న దేశవ్యాప్తంగా అన్ని కేంద్ర కార్మిక సంఘాలు బ్లాక్‌డే పాటించాలని నిర్ణయించామన్నారు. ఫార్మా బాధితుల పరామర్శకు వచ్చిన సీఎం చంద్రబాబు గత ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రమాదాల గురించి చెప్పారని.. అతను అధికారంలో ఉన్న 2014–19లో జరిగిన ప్రమాదాల సమయంలో ఏం చేశారని ఆమె ప్రశ్నించారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, ఏఐటీయూసీ విశాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.మన్మథరావు, జి.అచ్యుతరావు, అనకాపల్లి ప్రధాన కార్యదర్శి రాజా న దొరబాబు, నాయకులు ఎం.భద్రం, రాజబాబు,అల్లూరి ఏఐటీయూసీ కార్యదర్శి ఆమర్, విజయనగరం కార్యదర్శి బుగత అశోక్, రంగరాజు, శ్రీకాకుళం నాయకులు షణ్ముఖరావు, గోవింద్, కాకినాడ జిల్లా నేత తోకల ప్రసాద్, విశాఖ నేతలు కసిరెడ్డి సత్యనారాయణ, వెంకటరావు, కె.సత్యాంజనేయ, జేడీ నాయుడు, ఎస్.కె.రహమాన్, జి.వామనమూర్తి పాల్గొన్నారు.ఉక్కునగరం గురజాడకళాక్షేత్రంలో మూడు రోజులుగా జరుగుతున్న ఏఐటీయూసీ జాతీయసమితి సమావేలు మంగళవారంతో ముగిశాయి. ఇందులో భాగంగా జీవీఎంసీ గాంధీ పార్కులో బహిరంగసభ, ర్యాలీ నిర్వహించారు.

సాగునీటి చెరువులో పడి రైతు మృతి


చిన్నారావు మృతదేహం

రాజవొమ్మంగి : మండలంలోని చికిలింత గ్రామంలో సాగునీటి చెరువు నుంచి వస్తున్న నీరు ఎక్కువై పొలం ముంపునకు గురవుతోందని గమనించిన ఓ వృద్ధ రైతు గట్టు వేసేందుకు వెళ్లి చెరువులో పడి గల్లంతయ్యాడు. గ్రామస్తుల కథనం ప్రకారం మంగళవారం సాయంకాలం గ్రామానికి చెందిన కోసూరి చిన్నారావు (70) అనే రైతు అధిక వర్షాలకు తన పొలం ముంపుకు గురవుతోందని గుర్తించాడు. నీరు రాకుండా ఉండేందుకు సాగునీటి చెరువులో దిగి అడ్డుకట్ట వేసేందుకు ప్రయత్నించాడు. ఇంతలో అదుపుతప్పి లోతుగా వున్న చెరువులో మునిగిపోయాడు. ఇది గమనించిన తోటి రైతులు అతనిని వెంటనే చెరువు నుంచి బయటకు తీశారు. కాగా అప్పటికే అతను మరణించాడు. ఈ సంఘటనతో చికిలింతలో విషాదం నెలకొంది. నిరుపేద గిరిజన రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

నేడు పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం (విశాఖ): విజయవాడ రైల్వే డివిజన్ పరిధిలో కొనసాగుతున్న పునరుద్ధరణ చర్యల కారణంగా బుధవారం నాందేడ్–విశాఖపట్నం(20812) సూపర్ ఫాస్ట్, పుదుచ్చేరి–హౌరా(12868) సూపర్ ఫాస్ట్, సికింద్రాబాద్–విశాఖపట్నం–సికింద్రాబాద్(20707/20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం–సికింద్రాబాద్–విశాఖపట్నం(20833/20834) వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. మిగిలిన రైళ్లు యథాతథంగా నడుస్తాయని రైల్వే అధికారులు తెలిపారు.